క్లుప్తంగా

ధ్యానంపై శిక్షణ

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ కార్యక్రమం బుధవారం కళాశాలలో ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్‌నెస్ కార్యక్రమంలో విద్యార్థులకు మూడు రోజుల శిక్షణను ప్రారంభించిన ట్రైనర్ మాధురి, జయ మాట్లాడుతూ.. ధ్యానం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మంచి అలవాట్లు పొందుతారని తెలిపారు. 115 మంది విద్యార్థులు, 30 మంది అధ్యాపకులు హాజరయ్యారు.

దరఖాస్తుదారులకు నోటీసులు

పాల్వంచరూరల్: రెవెన్యూ సదస్సులో వచ్చిన భూభారతి దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం కోసం నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ దారా ప్రసాద్ బుధవారం మీడియాకు తెలిపారు. మండలంలో ఎనిమిది వేలపైన దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు ఆరు దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు.

కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండండి..

కొత్తగూడెంఅర్బన్: బీజేపీ దొంగ ఓట్లతో పెత్తనం చేస్తున్న విషయం యావత్ భారతదేశానికి తెలిసిందని, ఇక బీజేపీకి కాలం దగ్గర పడిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడెంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ సమావేశంలో రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయదలచిన ఆశావహులకు మార్గదర్శకాలు సూచించారు.రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి అన్ని పార్టీలు అండగా నిలవాలని, మోదీని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. గంటా వినయ్, పాదెం వీరయ్య, ఎడవల్లి కృష్ణ పాల్గొన్నారు.

8,700 దరఖాస్తులు

పాల్వంచరూరల్: రైతు బీమా గడువు బుధవారంతో ముగిసింది. రైతు భరోసా పథకంలో పేరు నమోదైన రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అమలు చేస్తుంది. మండలంలో మొత్తం 8,700 మంది రైతులు గతంలో దరఖాస్తులు చేసుకోగా, నూతనంగా ఇటీవల పట్టాదార్ పాసుపుస్తకాలు పొందిన 80 మంది ఆన్‌లైన్‌లో నమోదైనట్లు మండల వ్యవసాయ శాఖాధికారి శంకర్ తెలిపారు.

గడువు పెంపు

ఇల్లెందురూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ల గడువు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇల్లెందు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ బి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ జనరల్, ఒకేషనల్, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసినవారు నేరుగా అడ్మిషన్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు.

టేబుల్ టెన్నిస్ కోర్టును సద్వినియోగం చేసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీరాథోడ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ అన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ కోర్టును బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. అదేవిధంగా రైఫిల్ షూటింగ్, జిమ్‌ను ఉపయోగించుకొని ఆరోగ్య పరంగా ధృడంగా ఉండాలన్నారు.

శరవేగంగా ‘ఇందిరమ్మ ఇళ్లు’

- 24 పంచాయతీల్లో 565 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- 5 జీపీల్లో ప్రొసీడింగ్ రాకపోవడంతో ఆలస్యం
- పైలట్ ప్రాజెక్టు అనంతారంలో 85 ఇళ్లు
- ప్రతీవారం లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లు జమ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జూలూరుపాడు మండలంలో నిర్మాణ పనులు జోరందుకున్నాయి. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 565 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో అనంతారం గ్రామ పంచాయతీని రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకొని పక్కా ఇళ్లలేని 85 పేద కుటుంబాలకు ఇళ్లు ఇచ్చారు. దీంతో 24 గ్రామ పంచాయతీల్లో మొత్తం 565 ఇళ్లు మంజూరు చేయగా అనంతారం జీపీని మినహాయించి 23 జీపీల్లో 480 ఇళ్లు కేటాయించారు. 24 జీపీల్లోని 18 జీపీల్లో 226 ఇళ్లకు ప్రొసీడింగ్ రాగా, పాపకొల్లు, భేతాళపాడు, కాకర్ల, మాచినేనిపేటతండా, అన్నారుపాడు గ్రామ పంచాయతీల్లో 254 ఇళ్లకు ప్రొసీడింగ్ రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

జూలూరుపాడు: మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల్లో సగానికి పైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు అనంతారంలో 85 ఇళ్లకు గాను 60 ఇళ్లు గ్రౌడింగ్ కాగా, 13 ఇళ్ల పనులు తుదిదశకు చేరుకోవడంతో గృహప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధం అవుతున్నారు. 21 ఇళ్లు స్లాబ్ లెవల్, 51 ఇళ్లు బేస్‌మెంట్ పూర్తయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నాలుగు దశల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. తొలిదశలో బేస్‌మెంట్ పూర్తయితే రూ.లక్ష, రెండో దశ సన్‌సైడ్ లెవల్ రూ.లక్ష, మూడో దశ స్లాబ్ రూ.రెండు లక్షలు, నాలుగో దశ ప్లాస్టింగ్, రంగులు పూర్తయితే గ్రీన్ చానల్ ద్వారా ప్రతీ సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనకు ఆషాఢమాసం తాత్కాలికంగా బ్రేక్ పడినప్పటికీ శ్రావణమాసం ప్రారంభం నుంచి నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ


అనంతారంలో స్లాబ్ లెవల్‌లో ఇందిరమ్మ ఇళ్లు

ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందజేస్తామని చెప్పింది. కానీ ఇప్పటి వరకు అమలు కావడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇసుక కొనుగోలు చేసి పనులు పూర్తి చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షిస్తున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్ అన్నారు. బుధవారం వెంగన్నపాలెం గ్రామంలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడుతూ... అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. హౌసింగ్ ఏఈ గాడ్విన్, సెక్రటరీ లక్ష్మణ్, నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

సంతోషంగా ఉంది..


ఇందిరమ్మ ఇళ్లు రావడంతో సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా రేకుల ఇంట్లో ఇబ్బందులు పడుతూ వచ్చాం. ప్రస్తుతం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం స్లాబ్ లెవల్ అయింది. బేస్‌మెంట్ బిల్లు వచ్చింది.
– పూనెం కృష్ణకుమారి, అనంతారం

మూడు బిల్లులు వచ్చాయి..


పక్కా ఇల్లు లేక బాధపడ్డాం. ఇందిరమ్మ ఇల్లు ఇచ్చింది. నిర్మాణం పూర్తి కావొచ్చింది, ఇప్పటి వరకు మూడు బిల్లులు రూ.4 లక్షలు వచ్చాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు కాక, మరో రూ.5 లక్షలతో కట్టుకున్నాం. – పొందూరు పుష్ప, అనంతారం

కష్టాలు తీరతాయి..


ఇంటి పనులు పూర్తయితే మా కష్టాలు తీరుతాయి. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇల్లు రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసింది. బేస్‌మెంట్ పూర్తి కాగా, ఫొటో తీసుకొని వెళ్లారు. – రేగళ్ల వాసవి, జూలూరుపాడు

‘ఆశా’ల సమస్యలు పరిష్కరించండి..



మాట్లాడుతున్న ధనలక్ష్మి

ఇల్లెందు: ఆశా కార్యకర్తలు వెట్టి చాకిరీ చేస్తున్నారని, ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆశా కార్యకర్తల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ధనలక్ష్మి ఆరోపించారు. బుధవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల మహాసభలో ఆమె మాట్లాడారు. ఆశా కార్యకర్తలు ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఎన్నో సేవలు చేస్తున్నారని తెలిపారు. కరోనా కాలంలో వారియర్స్‌గా ఎంతోమంది ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు. అలాంటి వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వజ్జ సుశీల, చీమల రమణ, సుగుణ, మల్లీశ్వరి, విజయ, చంద్రకళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఫార్మసీ ఆఫీసర్ల సంఘం ఎన్నిక

పాల్వంచ: తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం పాల్వంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఎ.వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శిగా జి.సౌమ్య, ట్రెజరర్‌గా బి.లక్ష్మిలను ఎన్నుకున్నారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షుడిగా ఎల్.రాంచందర్, ఉపాధ్యక్షుడిగా జి.లక్ష్మీనరసింహారావు, జి.శశికళ, డి.రవికుమార్, సహాయ కార్యదర్శులుగా జి.పద్మ, సీహెచ్.ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.మురళి, పబ్లిసిటీ సెక్రటరీగా ఎం.అజయ్, ఎ.శ్రీలక్ష్మిలతో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు.

బీజేపీ తిరంగా యాత్ర


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కొత్తగూడెంఅర్బన్: శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్‌ను సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీరాథోడ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ అన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్‌ను బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. అదేవిధంగా రైఫిల్ షూటింగ్, జిమ్మును ఉపయోగించుకొని ఆరోగ్యపరంగా ధృడంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పూర్ణచందర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకన్న, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివజ్యోతి పాల్గొన్నారు.

టీపీటీఏ జిల్లా అధ్యక్షుడిగా నాగభూషణం


నియామకపత్రం అందుకుంటున్న నాగభూషణం

పాల్వంచ: తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఆదర్శ ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ రెంటాల నాగభూషణం నియామకమయ్యారు. బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కాంతారావు నుంచి నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సాగర్, మధిర నాయకుడు కోట వెంకట్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు మృతి

టేకులపల్లి: లచ్చా తండాకు చెందిన బీజేపీ నాయకుడు భూక్యా మంగ్యా (78) గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల క్రితమే భార్య సాలికి గుండెనొప్పి రావడంతో ఖమ్మం తీసుకెళ్లి వైద్యం చేయించారు. బుధవారం స్టంట్ వేయాలని వైద్యులు చెప్పారు. ఇందుకోసం హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడిని కూడా పిలిపించారు. ఈలోపు బుధవారం ఉదయం మంగ్యాకు ఛాతిలో నొప్పి రావడంతో ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తేజావత్ శంభునాయక్, బాలాజీ, పూన్యా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

స్వాతంత్య్ర వేడుకల కవాతు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 15న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎస్‌అండ్‌పీసీ సిబ్బందితో బుధవారం కవాతు నిర్వహించారు. జీఎం సెక్యూరిటీ చందా లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. మాట్లాడుతూ... కార్పొరేట్ ఏరియా జీఎం, నిర్వహణ కన్వీనర్ జీవీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకలకు సీఎండీ హాజరవుతున్న నేపథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఈ కవాతు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.


పరేడ్‌ను పరిశీలిస్తున్న జీఎం లక్ష్మీనారాయణ

ఏరియా ఉత్తమ కార్మికులు..

సింగరేణి(కొత్తగూడెం): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల వివరాలను బుధవారం ప్రకటించారు. బిరుదుకోట కుమారకృష్ణ (టెండాల్ పీవీకే–5 ఇంక్‌లైన్), అంకం రాజయ్య (కోల్ కట్టర్ పీవీకే–5 ఇంక్‌లైన్), పిల్లి శ్రీకాంత్ (ఈపీ ఆపరేటర్, జేవీఆర్ ఓసీ), వనమా వెంకటరమణ, ఫిట్టర్ (కిష్టారం ఓసీ), కొంటు సుధాకర్ (జనరల్ అసిస్టెంట్, కిష్టారం ఓసీ), దేగటి రాంబాబు (జనరల్ అసిస్టెంట్ ఆర్‌సీహెచ్‌పీ), ఎం.వెంకటరెడ్డి (ఎంవీ డ్రైవర్, జేవీఆర్ సీహెచ్‌పీ) ఎంపికయ్యారు. వీరు ప్రకాశం స్టేడియంలో సీఎండీ చేతులు మీదుగా అవార్డు అందుకోనున్నారు.

‘అధికారులు నిద్రమత్తు వీడాలి’

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాంతాల్లో అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ సుజాతను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మాట్లాడుతూ... శానిటేషన్ అధికారులు నిద్రమత్తు వీడాలని, కొత్తగూడెం ప్రధాన రహదారిపై పశువులు సంచరిస్తూ, రోడ్లపై బైఠాయిస్తూ, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ సరిగా లేదన్నారు. సీజనల్ వ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు దోమల మందు పిచికారీ చేయాలని, గతంలో నిధులు మంజూరై ప్రారంభించిన పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. పట్టణంలో కోతులు, కుక్కల బారీ నుంచి నగర ప్రజలను కాపాడాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



ధర్నాలో అంగన్‌వాడీలు, నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ టీచర్‌కు 2జీ సెల్‌లు ఇచ్చారని పదేళ్లుగా వాటిని వాడటం వల్ల మూలన పడ్డాయన్నారు. ప్రస్తుతం 5జీ స్పీడ్‌తో నెట్‌వర్క్ సెల్‌లు వచ్చాయని, ప్రభుత్వం అంగన్‌వాడీలకు కొత్త ఫోన్లు ఇవ్వకుండా నూతన యాప్‌లు ఉపయోగించాలడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో నెట్‌వర్క్ సమస్య ఉందని, ఆధార్, ఓటీపీ నంబర్లు మ్యాచ్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వాపోయారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.18వేల వేతనం ఇవ్వాలని, 5జీ ఫోన్లులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓకు అందజేశారు. 10 రోజులలో ప్రతీ అంగన్‌వాడీ టీచర్‌కు 5జీ ఫోన్లు అందజేస్తామని పీడీ స్వరలత లెనీనా హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జమలయ్య, ఎన్.ప్రసాద్, జి.మణి, ఆర్.అరుణ, బి.లలిత, విజయ, ఇంద్ర, సంధ్య, రత్నకుమారి, చిన్నారి, సరోజ, వినోద పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో నాణ్యత, రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతల మెరుగుదలకు ఉద్యోగులు అంకితభావంతో కృషి చేయాలని ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. బుధవారం కేటీసీలో మల్టీ డిపార్టుమెంటల్ టీమ్ నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. సింగరేణిలోని మిషనరీ పనితీరు, ఉత్పత్తి వ్యయం, ఇల్లెందు ఏరియాలో కంపెనీ భవిష్యత్, కార్మికులకు సంస్థ అందించిన సంక్షేమ కార్యక్రమాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను వివరించారు. యంత్రాల పనిగంటలు పెంచాలని, సంస్థపై వినియోగదారుడు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని తెలిపారు. ఉద్యోగుల నుంచి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, కేటీసీపీఓ గోవిందరావు, ఏరియా ఇంజనీర్ ఆర్వీ నరసింహారాజు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


హాజరైన ఉద్యోగులు, అధికారులు

మండలంలో 46,894 మంది ఓటర్లు

ఇల్లెందురూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదేశం మేరకు నూతన ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఒక కుటుంబం ఒక వార్డు పరిధిలోనే ఉండాలన్న ఆదేశంతో గ్రామపంచాయతీల వారీగా నూతన జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఈ ప్రకారం మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 46,894 ఓటర్లు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంలో భాగస్వాములు కండి..

ఇల్లెందు: దురలవాట్ల వల్ల సమాజం చెడిపోతుందని ప్రతీఒక్కరు మాదకద్రవ్యాలను నిరోధించాలని జీఎం వీసం కృష్ణయ్య కోరారు. బుధవారం ఇల్లెందు జీఎం కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేశారు. మాట్లాడుతూ.. సమాజం మీద మాదకద్రవ్యాల ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రామస్వామి, ఏజీఎం గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, ఏరియా రక్షణ అధికారి జాకీర్ హుస్సేన్, డీజీఎం సివిల్ రవికుమార్, సర్వే అధికారి రామ్మూర్తి, ఎస్టేట్ అధికారి శివ, క్వాలిటీ అధికారి రాందాస్, డీవైపీఎం శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి స్కూల్‌లో... పట్టణంలోని సింగరేణి హైస్కూల్‌లో కరస్పాండెంట్, డీజీఎం పర్సనల్ తుకారం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఎం బి.శ్రీనివాసరావు, విష్ణుప్రియ, ఏ.శ్రీనివాసరావు, రవీందర్, ధనలక్ష్మి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాలలో... పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో విద్యార్థులు మాదకద్రవ్యాల నిరోధం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్, ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్, పీడీ నజీముద్దీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.


సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

టేకులపల్లి: డ్రగ్స్ రహిత సమాజంలో అందరూ భాగస్వాములు కావాలని టేకులపల్లి ఎస్ఐ అలకుంట రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకులంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాల జీఎంలు, అధికారులు నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. జీఎం పర్సనల్ (వెల్ఫేర్) జీవీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... భారత సామాజిక న్యాయ, సాధికారక శాఖ, మరియు ఇంధన (ఓపీ) శాఖ జాయింట్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతీఒక్కరిని భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం ఈఈ సెల్ ఏజీఎం మురళీధర్‌రావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో జూలూరుపాడు పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్ నివారణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాదావత్ రవి, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, కేజీబీవీ ఎస్ఓ పద్మజ, టీచర్లు పాల్గొన్నారు.


ఇల్లెందు: మైనార్టీ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ సురేష్


టేకులపల్లి: బీసీ గురుకులంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు


జూలూరుపాడు: మాట్లాడుతున్న సీఐ శ్రీలక్ష్మి

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

కేంద్రం ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని.. దేశంలో ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల విధింపును నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో మోదీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయ కులు మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు అందించడంలో కేంద్రప్రభుత్వం విఫలం అయిందన్నారు. కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను తాకట్టు పెట్టిందన్నారు. దేశంలో సహజ వనరులను కొల్లగొట్టేందుకు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తోందన్నారు. ఓటర్ జాబితా అవకతవకలపై నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.
– సాక్షి నెట్‌వర్క్


సింగరేణి(కొత్తగూడెం): కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో...


సుజాతనగర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


జూలూరుపాడులో ట్రంప్ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు


ఇల్లెందు: ఆందోళన నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు


టేకులపల్లి: జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు